దక్షిణ,పశ్చిమ మండలం డీసీపీగా చంద్రమోహన్ బాధ్యతలు

ప్రజలకు శాంతి, భద్రతలను అందించడానికి కృషి చేస్తానని దక్షిణ,పశ్చిమ మండలం నూతన డీసీపీ చంద్ర మోహన్ అన్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఉదయ్‌కుమార్‌రెడ్డి బదిలీపై వెళ్లడంతో శుక్రవారం చంద్రమోహన్ శుక్రవారం పదవీబాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ శాంతి, భద్రతలను రక్షించడానికి శాయశక్తులా కృషి చేస్తానని పేర్కొన్నారు. పోలీసులు తమ విధులలో బాధ్యతగా వ్యవహరిస్తూ ప్రజలకు ఉత్తమ సేవలందించేలా చూస్తానని అన్నారు. – మెహిదీపట్నం జూలై 12

గోల్కొండ ఎల్లమ్మ ఆలయం హుండీ లెక్కింపు

గోల్కొండ మహంకాళి ఎల్లమ్మ ఆలయంలో ఆషాఢ మాసం రెండు బోనాల పూజలు ముగిసిన అనంతరం శుక్రవారం దేవాదాయశాఖ అధికారులు హుండీని లెక్కించారు. హుండీ ఆదాయం రూ. 2,91,940 ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో శ్రీనివాస రాజు తెలిపారు. బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ కాంత అరవింద్ మహేశ్‌కుమార్, సభ్యులు గరిశె నరేశ్, జె.రాకేశ్, కులవృత్తుల సంఘం అధ్యక్షుడు సాయిబాబా చారి తదితరులు పాల్గొన్నారు. – మెహిదీపట్నం

మ్యాన్‌హోల్.. పనుల పరిశీలన

ఇరానీహోటల్, తురాబ్‌నగర్, వడ్డబస్తీ, గౌడ సంఘం వెనకాల పాడైపోయిన వర్షపునీటి నాలా మ్యాన్‌హోల్ మరమ్మతు పనులను కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి శుక్రవారం పరిశీలించారు. కొన్ని నెలలుగా ఈ మ్యాన్‌హోల్స్ మూతలు విరిగి ప్రమాదభరితంగా తయారయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న కార్పొరేటర్ సంబంధిత అధికారులను పిలిపించి మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు చేయించారు. బీఆర్‌ఎస్ నాయకుడు బి.వెంకటరెడ్డి, మిర్యాల శ్రీనివాస్, శ్రీకాంత్ చౌదరి పాల్గొన్నారు. – అంబర్‌పేట, జూలై 12

కేసీఆర్ హయాంలోనే బోనాలకు కళ

బోనాల చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్సీ వెంకట్ తదితరులు

• చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్

కాచిగూడ, జూలై 12 : కుల, మతాలకు అతీతంగా తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే బోనాల పండుగను ప్రజలు భక్తి శ్రద్ధలతో వైభవంగా జరుపుకోవాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం అంబర్‌పేట నియోజకవర్గంలోని ఐదు డివిజన్లకు చెందిన 128 దేవాలయాలకు రూ.50 లక్షల 82 వేల విలువ చేసే చెక్కులను ఆలయాల నిర్వాహకులకు 5మంది కార్పొరేటర్లు, హిమాయత్‌నగర్, అంబర్‌పేట తాసీల్దార్లతో కలిసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కాచిగూడ తుల్జాభవన్‌లో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ హయాంలోనే బోనాల పండుగకు కళ వచ్చిందని పేర్కొన్నారు. ఆశాఢ మాసంలో నిర్వహించే బోనాల పండుగను తెలంగాణ మహిళలు అత్యంత భక్తితో జరుపుకుంటారని అన్నారు. దేవాలయాల అభివృద్ధికి గత ప్రభుత్వం కోట్లాది రూపాయలను మంజూరు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అసిస్టెంట్ కమిషనర్ ఎ.బాలాజీ, తుల్జాభవన్ ఈవో అంజనారెడ్డి, కార్పొరేటర్లు ఉమ రమేశ్‌యాదవ్, దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్, విజయ్‌కుమార్‌గౌడ్, అమృత, పద్మావెంకట్‌రెడ్డి, నాయకులు రమేశ్‌యాదవ్, సునీల్‌బిడ్లాన్, శ్రీరాములు ముదిరాజ్, భీష్మాదేవ్, నాగేందర్‌బాబ్జీ, భరత్‌రాజ్ ముదిరాజ్, కాలేరు రామకృష్ణ, కాలేరు రాజు, బి.కృష్ణాగౌడ్, పట్లూరి సతీశ్, కె.సదానంద్, బబ్లూ, విజితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలకు ఘనమైన ఏర్పాట్లు..

ముషీరాబాద్ : బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేయనున్నట్లు ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. అత్యంత ప్రాముఖ్యతగల బోనాల ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. శుక్రవారం భోలక్‌పూర్ భవానీ శంకర ఆలయంలో బోనాల ఉత్సవాల నిర్వాహకులకు రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, కార్పొరేటర్లతో కలిసి ఆయన చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. బోనాల ఉత్సవాలు జరిగే ఆలయాల వద్ద అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్లు, పారిశుద్ధ్యం, విద్యుత్, మంచినీటి సరఫరా, డ్రైనేజీ వంటి సమస్యలేకుండా చూసుకోవాలని కోరారు. ఆలయాల నిర్వాహకులు ఆలయాలను ముస్తాబు చేయడంతో పాటు భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. బోనాల ఉత్సవాలు వైభవంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్పొరేటర్‌లు సుప్రియా నవీన్‌గౌడ్, రవిచారి, రచనశ్రీ, పావని, ముషీరాబాద్ తాసీల్దార్ గోవర్ధన్, బీఆర్‌ఎస్ నేత ముఠా జయసింహ, నాయకులు వై.శ్రీనివాస్, బి.శ్రీనివాస్‌రెడ్డి, రాకేశ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయాల నిర్వాహకులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్

కేసీఆర్‌ను కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు

మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావును అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు పలువురు శుక్రవారం ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ ఉద్యమకారుడు కె.లింగారావు, కె.సంజీవరావు, రామారావుయాదవ్ కేసీఆర్‌ను కలిశారు. – అంబర్‌పేట, జూలై 12

చల్ల సోమ్‌రాజ్‌రామ్ సేవలు చిరస్మరణీయం



సోమ్‌రాజ్‌రామ్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ విశ్వనాథం, హాస్టల్ ప్రతినిధులు

కాచిగూడ,జూలై 12: సంఘసేవకుడు, ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ చెల్ల సోమ్‌రాజ్‌రామ్ అందించిన సేవలు చిరస్మరణీయని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కామర్స్ చైర్మన్ డాక్టర్ వంగపల్లి విశ్వనాథం అన్నారు. చెల్ల సోమ్‌రాజ్‌రామ్ 94వ జయంతిని శుక్రవారం రాత్రి వైశ్యహాస్టల్‌లోని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేద విద్యార్థులకు రూ.10 లక్షల విలువ చేసే స్కాలర్‌షిప్ చెక్కులు, నోట్‌బుక్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ జి. ధనుంజయ, వి.నగేశ్, కూర రఘువీర్, ఉప్పల రాజేశ్వర్, పబ్బతి రవిప్రసన్న, పి.రాజేశ్వర్‌రావు, జయప్రకాశ్‌రాం, రాములుగుప్త, దాయకర్‌గుప్త పాల్గొన్నారు.

మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణమూర్తి

చిక్కడపల్లి, జూలై 12: కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పి.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. అసోసియేషన్ సబ్ కమిటీ సమావేశం శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కన్వీనర్ స్వరాజ్‌కుమార్ భట్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న 4 డీఏల అమలుతో పాటు గత వేతన సవరణ కమిషన్ సూచనలను వెంటనే అమలు చేయాలని అన్నారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.జనార్దన్‌రెడ్డి, ఎం. నరహరి, దుర్గాప్రసాద్, అరుణ, సీతారం,లక్ష్మీనారాయణ, అశోక్, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ

కార్పొరేటర్‌లతో కలిసి దేవాలయాలకు బోనాల చెక్కులను పంపిణీ చేస్తున్న గోషామహల్ ఎమ్మెల్యే టి. రాజాసింగ్

అబిడ్స్, జూలై 12 : ఆషాఢ బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని దేవాదాయ శాఖ కార్యాలయంలో అమ్మవారి ఆలయ కమిటీలకు చెక్కులను పంపిణీ చేశారు. గోషామహల్ నియోజకవర్గం పరిధిలోని 72 అమ్మవారి ఆలయాలకు బోనాల చెక్కులను గోషామహల్ ఎమ్మెల్యే టి రాజాసింగ్, ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్ రావు లు కార్పొరేటర్‌లు జి శంకర్ యాదవ్, రాకేశ్ జైస్వాల్, లాల్‌సింగ్, సురేఖ ఓంప్రకాశ్, శశికళ కృష్ణలతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి.రాజాసింగ్, ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్‌రావులు వేర్వేరుగా మాట్లాడుతూ.. బోనాల ఉత్సవాలను ఘనంగా జరుపుకునేందుకు గాను అమ్మవారి ఆలయాలకు నిధులు విడుదల చేసినట్లు తెలిపారు.

సంస్కృతి వారసత్వాన్ని ..కొనసాగించాలి

రవీంద్రభారతి, జూలై 12 : సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనే ఉందని భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. తల్లి దండ్రులు తమ పిల్లలకు సంప్రదాయ కళల పట్ల ఆసక్తిని పెంచి వారిని ఉత్తమ పౌరులుగా సామాజానికి అందించాలని అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో కరుగంటి కళాక్షేత్రం నాట్య సంస్థ 27వ వార్షికోత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా డాక్టర్ మామిడి హరికృష్ణ,నత్యగరువు కురుగంటి రాధిక విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 50మందికి పైగా చిన్నారులు చేసిన నృత్య రూపకం అలరించింది. ఈ సందర్భంగా వైద్య రత్న భరతనాట్యకళాకారిణి డాక్టర్ సుమకు నృత్య రత్న , జర్నలిస్టు ఆర్.వి. రమణకు పాత్రికేయ రత్న , డాక్టర్ వెంకటేశ్వరరెడ్డికి సేవారత్న , శృంగార గోవిందా చార్యకు సంగీత రత్న అవార్డులను ఆయన బహూకరించారు.

మైనర్ కిడ్నాప్.. నిందితుడి అరెస్టు

సుల్తాన్‌బజార్, జూలై 12: 9వ తరగతి చదువుతున్న మైనర్‌ను కిడ్నాప్ చేసి పెళ్లికి బలవంతం చేసిన నిందితుడిని అరెస్టు చేసిన ఘటన శుక్రవారం సుల్తాన్‌బజార్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి తెలిపిన ప్రకారం.. ఈ నెల 8న బడిచౌడీ ప్రాంతానికి చెందిన 9వ తరగతి చదువుతున్న మైనర్ పాఠశాలకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కంగారు పడ్డ తండ్రి సుల్తాన్‌బజార్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా బాలికను కిడ్నాప్ చేసింది ఇసామియా బజార్ కోమట్ బస్తీకి చెందిన జి. విజయ్‌గౌడ్‌ను గుర్తించారు. దీంతో శుక్రవారం విజయ్‌గౌడ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

కళా మారుతి నూతన వేదిక ప్రారంభం

చిక్కడపల్లి త్యాగరాయగాన సభ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన కళా మారుతి వేదిక(నూతన హాలు)ను గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సాంస్కృతిక కార్యక్రమాలను ప్రోత్సహించడమే లక్ష్యంగా మరో సాంస్కృతిక వేదికను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. గానసభ ప్రధాన కార్యదర్శి శారదా దీక్షితులు, కమిటీ సభ్యులు గుండవరపు విద్యాసాగర్, గీతాదేవి, శంకర్ నారాయణ, సీహెచ్‌వీ ప్రసాద్, జంగంరావుగౌడ్, బండి శ్రీనివాస్ కళా మహాలక్ష్మి, తాళ్లపల్లి చక్రపాణి, బమిడి ఉషా, బండి నాగజ్యోతి పాల్గొన్నారు. – ముషీరాబాద్

కరెంట్ బిల్లుల వసూలు కేంద్రం ప్రారంభం

కార్వాన్ నియోజకవర్గం నానల్‌నగర్ డివిజన్‌లో విద్యుత్ శాఖ అధికారులు ప్రజల సౌకర్యం కోసం కరెంట్ బిల్లుల వసూలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. టోలిచౌకి నుంచి హకీంపేట్ వెళ్లే రోడ్డులో జానకీనగర్ వద్ద ఈ కేంద్రాన్ని శుక్రవారం కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్, డీఈ శ్యాంసుందర్‌రెడ్డి, ఏడీ సాంబశివరావు, నానల్‌నగర్ కార్పొరేటర్ ఎండీ నసీరుద్దీన్‌లతో కలిసి ప్రారంభించారు. – మెహిదీపట్నం, జూలై 12

దుకాణదారులకు న్యాయం చేస్తాం..

నాంపల్లి నియోజకవర్గం గుడిమల్కాపూర్‌లో ఉన్న పి.ఇంద్రారెడ్డి పూలమార్కెట్‌లోని మార్కెటింగ్ శాఖ కూల్చి వేసిన దుకాణదారులకు అధికారులు న్యాయం చేసే విధంగా కృషి చేస్తామని నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ అన్నారు. ఈ మేరకు మార్కెటింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావుతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. దుకాణాలను తొలగిస్తే పేదలు ఎట్లా బతుకుతారో అధికారులే చెప్పాలంటూ ప్రశ్నించారు. దుకాణాలను కోల్పోయిన 33 మందికి న్యాయం చేయాలంటూ ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. – మెహిదీపట్నం, జూలై 12

మాతం ఊరేగింపు మార్గం ఎమ్మెల్సీ పరిశీలన

రహదారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ హసన్ హఫంది, జోనల్ కమిషనర్ వెంకన్న

చార్మినార్,జూలై 12 : షియా ముస్లింలు నిర్వహించే మొహర్రం సంతాప దినోత్సవాల్లో ఎలాంటి ఆటంకాలు లేకుండా జీహెచ్‌ఎంసీ అభివృద్ధి పనులు చేపట్టాని ఎమ్మెల్సీ మీర్జా రియాజ్ హసన్ హఫందీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్నతో కలిసి మొహర్రం సందర్భంగా నిర్వహించే సంతాప ర్యాలీ కొనసాగే ప్రధాన మార్గాన్ని పరిశీలించారు. చార్మినార్ సమీపంలోని పాదచారుల కోసం అమర్చిన రాతి పలకలు ధ్వంసమై రాకపోకలకు ఇబ్బందిగా మారిన విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మరో వారం రోజుల్లో కొనసాగనున్న మాతం ఊరేగింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు

పర్మిట్‌రూమ్‌లు, బెల్ట్‌షాపులను అరికట్టండి

తెలుగు యూనివర్సిటీ : రాష్ట్రంలో కొనసాగుతున్న బెల్ట్‌షాపులను అరికట్టాలని తెలంగాణ బార్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇష్టారాజ్యాంగ నడుస్తున్న వైన్‌షాపుల వల్ల బార్‌అండ్ రెస్టారెంట్‌ల యజమానులు నష్టపోతున్నారని ఆరోపించారు. బార్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం ఎక్సైజ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన అనంతరం మాట్లాడుతూ.. వైన్‌షాపులకు పర్మిట్ రూమ్‌లు లేకుండా, బెల్ట్‌షాపులను నియంత్రించేలా ఎక్సైజ్‌శాఖ మంత్రి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి. రాజుగౌడ్, గౌరవ అధ్యక్షుడు జి. విజయకుమార్, ప్రధాన కార్యదర్శి ఎ.రామకృష్ణ, కోశాధికారి శ్రీధర్‌రెడ్డి, కార్యదర్శులు పల్లె నరసింహారావు, తిరుపతయ్యాగౌడ్ పాల్గొన్నారు.

మృతదేహం స్వాధీనం

చిక్కడపల్లి, జూలై 12: చిక్కడపల్లి పోలీసులు గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాని స్వాధీనం చేసుకుని గాంధీ దవాఖానలో భద్రపరిచారు. సీఐ సీతయ్య తెలిపిన వివరాల ప్రకారం. చిక్కడపల్లి ప్రధాన రోడ్డులోని మెట్రో పిల్లర్ నంబర్ 1122 వద్ద ఫుట్‌పాత్ పై ఓ‌వ్యక్తి అపస్మారకస్థితి పడి ఉన్నారని సమాచారం అందింది. పోలీసులు అక్కడి చేరుకుని పరిశీలించగా ఓ వృద్ధుడు మృతిచెంది నట్లు గుర్తించారు. మృతిడికి 50 సంవత్సరాల వయ్యస్సు ఉంటుందని అన్నారు. వివరాలకు చిక్కడపల్లి పోలీసులకు సంప్రదించాలని సూచించారు.

వివిధ కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 12: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొ. రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఓయూ దూరవిద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి. రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా అందించే వివిధ పీజీ డిప్లొమా కోర్సుల పరీక్షలను ఈ నెల 25 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www. osmania.ac.inలో చూసుకోలి.

ప్రశాంతంగా టీజీ సీపీజీఈటీ 2024 పరీక్షలు

రాష్ట్రవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల పీజీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే టీజీ సీపీజీఈటీ – 2024 పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఈ నెల 6న ప్రారంభమైన ఈ పరీక్షలు ఈ నెల 16 వరకు జరుగనున్నట్లు సీపీజీఈటీ కన్వీనర్ ప్రొఫెసర్ ఐ. పాండురంగారెడ్డి తెలిపారు. ఈ పరీక్షలు శుక్రవారం ఆరు సబ్జెక్టులకు నిర్వహించినట్లు చెప్పారు. ఈ పరీక్షలకు మొత్తం 18,411 మంది దరఖాస్తు చేసుకోగా, మొత్తం 16,542 మంది హాజరయ్యారని వివరించారు. హాజరు శాతం 89.84గా నమోదైందని పేర్కొన్నారు.

ఈసీఐఎల్ - మెహిదీపట్నం నాలుగు మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు

సిటీబ్యూరో, జూలై 12(నమస్తే తెలంగాణ): ఈసీఐఎల్ నుంచి మెహిదీపట్నం (రూట్ నంబర్ 16హెచ్/49ఎం) మార్గంలో నాలుగు మెట్రో ఎక్స్‌ప్రెస్‌లను ప్రారంభిస్తున్నట్లు గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి. వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసీఐఎల్ నుంచి మొదటి బస్సు ఉదయం 7 గంటల నుంచి అందుబాటులో ఉంటుందని మెహిదీపట్నం నుంచి ఉదయం 8:30గంటలకు అందుబాటులో ఉంటుందని చెప్పారు.

డీజీపీని కలిసిన నాయకులు



రాష్ట్ర నూతన డీజీపీగా భాధ్యతలను స్వీకరించిన జితేందర్‌ను శుక్రవారం టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు మారం జగదీశ్వర్, డాక్టర్ ఎస్‌ఎం ముజీ బ్ హుస్సేనీ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, కేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, నగర శాఖ అధ్యక్షుడు కట్కూరి శ్రీకాంత్, బీటీఎన్జీవో సభ్యులు మల్లారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు. – సుల్తాన్ బజార్

రేపు మున్నూరుకాపుల వివాహ పరిచయ వేదిక

మాట్లాడుతున్న మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వరరావు తదితరులు

కాచిగూడ, జూలై 12: మున్నూరుకాపు మహాసభ ఆధ్వర్యంలో మున్నూరుకాపు యువతీయువకుల కోసం వివాహ పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మహాసభ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 14వ తేదీ(ఆదివారం)కాచిగూడ మ్యాడం అంజయ్య హాల్‌లో వివాహ పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పరిచయ వేదికను తెలంగాణలోని యువతీయువకులు సద్వినియోగం చేసు కోవాలని సూచించారు. ముఖ్యఅతిథులుగా కేంద్ర మంత్రి బండి సంజయ్, మంత్రి కొండ సురేఖ, ఎంపీ ధర్మపురి అరవింద్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, గంగుల కమలాకర్, మాజీ ఎంపీ హనుమంతరావు, విప్ ఆది శ్రీనివాస్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవీందర్, కె.లక్ష్మణ్, ట్రస్ట్ చైర్మన్ ఎం.ఆర్. వెంకట్రావ్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. వివాహ పరిచయ వేదిక చైర్మన్ గోపాల రాధాకృష్ణ, కన్వీనర్ కె.శ్రీనివాస్, లింగిశెట్టి హనుమంత్‌రావు, రమేశ్‌కుమార్, కె.సుభాష్, ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

మెట్టు సాయికుమార్‌కు సన్మానం

ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ నేతృత్వంలో మత్స్యకారుల సమస్యలు తీరుతాయని గన్‌ఫౌండ్రి డివిజన్ మాజీ కార్పొరేటర్ మమతా సంతోష్ గుప్తా దంపతులు అన్నారు. ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్‌ను శాంతినగర్‌లోని మత్స్య భవన్‌లో కలిసి మొక్కను బహూకరించి సన్మానించారు. – అబిడ్స్, జూలై 12

వైఎంసీఏ ఫిజికల్ డైరెక్టర్‌గా జార్జ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: వైఎంసీఏ గ్రేటర్ హైదరాబాద్ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా డాక్టర్ ఎజినె జార్జ్ నియమితులయ్యారు. శుక్రవారం సమావేశమైన వైఎంసీఏ బోర్డు డైరెక్టర్లు జార్జ్ ఎంపికపై తుది నిర్ణయం తీసుకున్నారు. బాస్కెట్ బాల్ క్రీడలో జార్జ్‌కు సుదీర్ఘ అనుభవముంది. అటు ప్లేయర్‌గా లెక్కకు మిక్కిలి పతకాలు సాధించడంతో పాటు తన శిక్షణలో మెరికల్లాంటి ప్లేయర్లను తీర్చిదిద్దాడు. పలు క్రీడల్లో ప్లేయర్లకు శిక్షణ అందించడంలో జార్జ్ కీలకంగా వ్యవహరించారు.

అభివృద్ధి పేర పేదల ఇండ్లకు గుర్తులు సబబు కాదు: సీపీఎం నాయకులు

అంబర్‌పేట, జూలై 12: మూసీ అభివృద్ధి పేరుతో పేదలు నిర్మించుకున్న ఇండ్లకు గుర్తులు పెట్టడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఎం నగర కార్యదర్శి శ్రీనివాస్, నియోజకవర్గం కన్వీనర్ ఎం.మహేందర్‌లు ఖండించారు. బస్తీబాట కార్యక్రమంలో భాగంగా మూసీ పరీవాహక ప్రాంతలలో శుక్రవారం పర్యటించారు. ఆయా బస్తీవాసుల నుంచి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గుజరాత్‌లోని సబర్మతి నది మాదిరిగా మూసీని అభివృద్ధి చేయాలని, లండన్ తరహాలో శుద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కలించాలని నిర్ణయించి మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని చెప్పారు. దీన్ని పురస్కరించుకొని ఇటీవల రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్, పోలీసుల అధికారులు మూసీ పరీవాహక ప్రాంతంలో బస్తీలను సందర్శిస్తూ ఇండ్లకు గుర్తులు పెడుతున్నారని దీంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని, తక్కువ ధరకు వస్తుందని ఇక్కడ జాగా, కొనుగోలు చేసి ఇండ్లు కట్టుకున్నారని పేర్కొన్నారు. అప్పుడు అడ్డుకోకుండా ఇప్పుడు వచ్చి గుర్తులు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ప్రస్తుతం ఉన్న ఇండ్లను కూల్చివేయాలనే ఆలోచన మానుకోవాలని చెప్పారు.

కులగణన చేసే వరకు పోరాటం

రవీంద్రభారతి, జూలై12 : రాష్ట్ర కులగణనను చేపట్టి బీసీ రిజర్వేషన్లను జనాభా దామాషా ప్రకారం పెంచే వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఐఏఎస్ అధికారి చిరంజీవులు అన్నారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ కుల సంఘాల జేఏసీ కోఆర్డినేటర్ ఉప్పర శేఖర్ సగర ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ నుంచి కామారెడ్డి కరీంనగర్ వరకు నిర్వహించనున్న సమగ్ర కులగణన సాధన యాత్ర వాల్ పోస్టర్‌ను 40 బీసీ కులాల రాష్ట్ర అధ్యక్షుడు , 20 బీసీ సంఘాలు, మహిళా సంఘాలు, విద్యార్థి సంఘాల అధ్యక్షులతో కలిసి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 14 నుంచి 31 వరకు 17 రోజులు పది జిల్లాల్లో సమగ్ర కులగణన సాధన యాత్ర పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుందాల గణేష్‌చారి, కనకాల శ్యాంకుర్మా, మణిమంజరి తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ల స్నాచింగ్.. నిందితుల రిమాండ్

సుల్తాన్‌బజార్, జూలై 12 : ముగ్గురు స్నేహితులు కలిసి దొంగతనాలకు పాల్పడి కటాకటాల పాలైన ఘటన సుల్తాన్‌బజార్ పరిధిలో శుక్రవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి వివరాల ప్రకారం.. ఇంజన్‌బౌలి ఫలక్‌నుమాకు చెందిన ఓస్కోలా పవన్, జంగమ్మెట్ స్టేషన్ రోడ్‌కు చెందిన పస్తం వంశీతేజ,కృష్ణారెడ్డి నగర్, ప్పుగూడకు చెందిన అల్లిమల్లి వంశీ లు ముగ్గురు స్నేహితులు. ఈ నెల 9న కోఠి గుజరాతి గల్లీలో పనుల నిమిత్తం వచ్చిన మహ్మద్ జలీల్ చేతిలోని ఫోన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు లాకెళ్లారని సుల్తాన్‌బజార్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలించి స్నాచింగ్‌కు పాల్పడింది పవన్, వంశీ తేజ, వంశీలను గుర్తించారు. నిందితుల వద్ద నుంచి రెడ్‌మి 7 ప్రో ఫోన్, హోండా డియో(టీఎస్ 08 జే డబ్ల్యూ 1720)ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకొన్నారు. 24 గంటలలోనే నిందితులను అరెస్టు చేసిన క్రైం సిబ్బందిని ఇన్‌స్పెక్టర్ అభినందించారు.

నల్ల పోచమ్మ ఆలయంలో బోనాలు

సచివాలయంలోని నల్ల పోచమ్మ ఆలయంలో బోనాల సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్ లక్ష్మణ్‌రావు పూజా కార్యక్రమంలో పాల్గొనగా ఎర్రం శ్రీనివాస్, మనోజ్ మొగల్‌గిద్దీ, నరేశ్, ప్రవీణ్‌యాదవ్ పాల్గొన్నారు. – అబిడ్స్, జూలై 12

అన్వేషణ ఆవిష్కరణ సభ

రవీంద్రభారతి, జూలై12 : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ , తెలంగాణ రచయితల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో డా. తూర్పు మల్లారెడ్డి సాహిత్య వ్యాసాలు అన్వేషణ పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తలుగా సాహిత్య అకాడమీ పూర్వ చైర్మన్ డా.నందిని సిధారెడ్డి, ప్రముఖ సాహిత్యవేత్త డా.ఏనుగు నరసింహారెడ్డి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ విచ్చేసి అన్వేషణ పుస్తకాన్ని ఆవిష్కించారు.

దోమల నివారణపై అవగాహన

అబిడ్స్: నీరు నిల్వ ఉండకుండా చెత్తా చెదారం పేరుకుపోకుండా చూసుకున్నప్పుడే దోమల నుంచి రక్షించుకోవచ్చని జీహెచ్ఎంసీ ఫీల్డ్ ఎంటమాలజీ ఫీల్డ్ అసిస్టెంట్ దిలీప్ అన్నారు. గోషామహల్ నియోజకవర్గం జీహెచ్ఎంసీ అధికారులు కట్టెలమండిలోని ఆంధ్ర విద్యాలయ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

శుభాకాంక్షలు..



తెలంగాణ పారిశ్రామిక మౌళిక సదుపాయాల సంస్థ చైర్మన్‌గా పదవి బాధ్యతలు స్వీకరించిన తూర్పు నిర్మల జగ్గారెడ్డికి కాంగ్రెస్ నగర నాయకురాలు దేవిరెడ్డి విజితారెడ్డి కార్యాలయంలో శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు. – కాచిగూడ,జూలై 12

నాట్య గురువు ప్రొఫెసర్ అలేఖ్య పుంజాల తెలంగాణ సంగీత, నాట్య అకాడమీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా గురువారం ఎన్ఎస్‌యూ నగర కార్యదర్శి సీ వినయ్‌కుమార్ ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. – చిక్కడపల్లి, జూలై 12

మేయర్‌కు ఆహ్వానం

ఆషాఢ బోనాలకు రావాలని కోరుతూ పాతనగర ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజు అంజయ్య శుక్రవారం మేయర్‌ను ఆమె కార్యాలయంలో కలసి ఆహ్వానించారు. బోనాల ఉత్సవాలకు ముందస్తు చర్యల్లో భాగంగా అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన మేయర్‌ను కోరారు. – చార్మినార్, జూలై 12